నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 | నల్లగొండ, మంగళవారం 11 జూన్ 2024 | NALGONDA


## రైతు బంధు నగదు రైతుల ఖాతాల్లో జమ చేయాలి

- మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్

చందంపేట(దేవరకొండ)జూన్ 10 : వానకాలం ప్రారంభం కావడంతో రైతుల ఖాతాల్లో రైతు బంధు నగదును జమ చేయాలని బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేవరకొండలో ఆయన సోమవారం మాట్లాడారు. వానకాలం వచ్చినా రైతు బంధు నిధులు విడుదల చేయడంలో నిర్లక్ష్యం తగదన్నారు. ఎకరాకు రూ.7,500 రైతుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. బీఆర్ఎస్ హయాంలో రైతుల ఖాతాల్లో రైతు బంధు సకాలంలో జమ అయ్యిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలన్నారు. వ్యవసాయాన్ని కాంగ్రెస్ చిన్నచూపు చూస్తున్నదని విమర్శించారు. ఎరువుల కొరత లేకుండా తగిన చర్యలు చేపట్టాలని కోరారు.

# ట్రిపుల్ ఆర్ భూసేకరణకు అడుగులు

**ఉత్తర భాగానికి త్రీజీ నోటిఫికేషన్ విడుదల**

**8గ్రామాల నిర్వాసితులకు నోటీసులు జారీ**

- ఈనెల 26 వరకు చౌటుప్పల్ ఆర్డీఓ ఆఫీసులో విచారణ
- రెండు మండలాల్లో 550 ఎకరాల భూసేకరణ
- అలైన్‌మెంట్ మార్పు చాన్స్‌తో చౌటుప్పల్, లింగోజిగూడ పెండింగ్
- ఇప్పటికే యాదాద్రి, తుర్కపల్లిలో అవార్డు ఎంక్వైరీ పూర్తి
- రాయగిరి అలైన్‌మెంట్ మార్పు జరిగేనా..?

**భారత్ మాల పరియోజన కింద హైదరాబాద్‌కు ఉత్తర భాగాన గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే ప్రాంతీయ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) భూ సేకరణలో కదలిక వచ్చింది. ట్రిపుల్ ఆర్ నిర్మాణం కోసం అడుగులు పడ్డాయి. ఈ మేరకు అధికారులు 3జీ నోటిఫికేషన్ విడుదల చేశారు. చౌటుప్పల్ డివిజన్‌లోని ఏడు గ్రామాల నిర్వాసితులకు అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ నెల 26వరకు చౌటుప్పల్ ఆర్డీఓ కార్యాలయంలో గ్రామాల వారీగా సమావేశాలు నిర్వహించి.. విచారణ తర్వాత భూములకు ధరలను నిర్ణయించనున్నారు. భూపరిహారం కోసం అవార్డు ఎంక్వైరీ చేపట్టనున్నారు.**

*– యాదాద్రి భువనగిరి, జూన్ 10 (నమస్తే తెలంగాణ)*




ట్రిపుల్ ఆర్ ప్రాజెక్ట్‌లో భాగంగా సంగారెడ్డి జిల్లాలోని గిర్మాపూర్ నుంచి మెదక్, సిద్దిపేట జిల్లాల మీదుగా యాదాద్రి భువనగిరి జిల్లాలోని చౌటుప్పల్ వరకు హైదరాబాద్ ఉత్తర భాగం తొలి విడుతలో రీజినల్ రోడ్డు నిర్మించనున్నారు. 159 కిలోమీటర్ల మేర 100 మీటర్ల వెడల్పుతో రోడ్డు నిర్మించాలని ప్రతిపాదించారు. ఇందుకు అనుగుణంగా చౌటుప్పల్, వలిగొండ, భువనగిరి, యాదగిరిగుట్ట, తుర్కపల్లి మండలాల పరిధిలోని 34 రెవెన్యూ గ్రామాల్లో భూసేకరణ చేపట్టనున్నారు. చౌటుప్పల్, వలిగొండ మండలాల్లో భూ సేకరణకు ఈ నెల 7న అధికారులు 3జీ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆయా మండలాల్లోని పలు గ్రామాల మీదుగా ట్రిపుల్ ఆర్ రోడ్డు వేయనున్నారు. ఇందులో భాగంగా 133.178 కి.మీ నుంచి 156.045 కి.మీ. వరకు రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. చౌటుప్పల్ మండలంలోని తాళ్ల సింగారం, నేలపట్ల, చిన్నకొండూరు, వలిగొండ మండలంలోని పొద్దుటూరు, పహిల్వాన్‌పురం, గోకారం, రెడ్లరేపాక, వర్కట్‌పల్లి మీదుగా గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణం జరుగుతుంది.

### గ్రామాల వారీగా తేదీలు ఇవే..

ఆయా గ్రామాల భూ నిర్వాసితులు ఈ నెల 10 నుంచి 26 వరకు ఉదయం 11గంటలకు చౌటుప్పల్ ఆర్డీఓ కార్యాలయంలో జరిగే సమావేశానికి హాజరు కానున్నారు. 10వ తేదీన చౌటుప్పల్ మండలంలోని తాళ్లసింగారం, 12న నేలపట్ల, 14న చినకొండూరు, 18న, వలిగొండ మండలంలోని పొద్దుటూరు, 20న పహిల్వాన్‌పురం, 22న గోకారం, 24న రెడ్లరేపాక, 26న వర్కట్‌పల్లి గ్రామాల నిర్వాసితులకు సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ మీటింగ్‌లో ఎంత భూమి పోతుంది..? మార్కెట్ విలువ ఎంత..? కోల్పోయిన భూమికి నష్టపరిహారం ఎంత చెల్లిస్తారు ? అనే విషయాలను వివరిస్తారు. ఒక వేళ అభ్యంతరాలు ఉంటే స్వీకరిస్తారు. ఇందులో భూ సేకరణకు సంబంధించి రేటును నిర్ణయించాక రైతుల నుంచి అనుమతి కూడా తీసుకోనున్నారు. ఆ తర్వాత మళ్లీ జనరల్ అవార్డు పాస్ చేస్తారు. ఫైనల్‌గా అంతా సరిగా ఉంటే నిర్వాసితుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తారు.

### చౌటుప్పల్ పట్టణం, లింగోజిగూడ పెండింగ్..

జిల్లాలో మూడు సెక్షన్లలో(కాలా) భూ సేకరణ చేపడుతున్నారు. చౌటుప్పల్ డివిజన్‌లో చౌటుప్పల్, వలిగొండతోపాటు భువనగిరి డివిజన్‌లో రెండు సెక్షన్లు ఉన్నాయి. యాదగిరిగుట్ట, తుర్కపల్లి ఒక కాలా కాగా, భువనగిరి మండలంలో మరో సెక్షన్ ఉంది. యాదగిరిగుట్ట, తుర్కపల్లి ఇప్పటికే భూసేకరణకు అవార్డు ఎంక్వైరీ పూర్తయ్యింది. రాయగిరికి సంబంధించి హైకోర్టు స్టే ఉండటంతో పెండింగ్‌లో ఉంది. కాగా చౌటుప్పల్ మండల పరిధిలో చౌటుప్పల్ పట్టణం, లింగోజిగూడ వద్ద జంక్షన్లు, అలైన్‌మెంట్‌లో మార్పులు ఉండే అవకాశాలు ఉన్నాయి. దాంతో ఈ రెండు గ్రామాలకు కూడా అవార్డు ఎంక్వైరీ పెండింగ్‌లో ఉంచారు.

### 550 ఎకరాల భూ సేకరణ

చౌటుప్పల్, వలిగొండ మండలాల్లోని వివిధ గ్రామాల నుంచి 550 ఎకరాల భూమిని సేకరించనున్నారు. ఇందుకోసం సోమవారం నుంచి ఈ నెల 26 వరకు ఆయా గ్రామాల వారీగా చౌటుప్పల్ ఆర్డీఓ కార్యాలయంలో సమావేశాలు నిర్వహించి విచారణ చేపట్టనున్నారు. నిర్వాసితులు తమ భూములకు సంబంధించి ఒరిజినల్ పత్రాలు, పట్టాదారు పాస్ పుస్తకం, బ్యాంక్ పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, పాన్ కార్డుతోపాటు వాటి జిరాక్స్ కాపీలను తీసుకొని సమావేశాలకు హాజరుకావాలి. ఆయా నిర్వాసితులు భూమిపై ఉన్న హక్కును ధ్రువపరుచుకోవాల్సి ఉంటుంది. ఒక వేళ నిర్ణీత సమయంలో క్లెయిమ్‌లు, డాక్యుమెంట్లు సమర్పించకపోతే రికార్డులను అనుసరించి నష్టపరిహారం లెక్కించరు.

### రాయగిరి అలైన్‌మెంట్ మారుస్తానని కోమటిరెడ్డి హామీ

ట్రిపుల్ ఆర్ భూసేకరణకు అడుగులు పడటంతో అందరి దృష్టి రాయగిరి వైపు మళ్లినట్లయ్యింది. ప్రస్తుతానికి హైకోర్టులో స్టే ఉండగా, అలైన్‌మెంట్ మారుతుందా..? లేదా అనేది తేలాల్సి ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మారుస్తామని హామీ ఇచ్చింది. ప్రస్తుత ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ట్రిపుల్ ఆర్ బాధితులతో కలిసి నాడు ధర్నా కూడా చేశారు. అధికారంలోకి వచ్చాక కలెక్టరేట్‌లో జరిగిన సమీక్ష అనంతరం కూడా అలైన్‌మెంట్ మారుస్తామని ప్రకటించారు. కానీ ఇప్పటి వరకు దీనిపై ఎలాంటి స్పష్టత, కదలిక లేదు.



బాధిత కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ ఇన్సూరెన్స్ చెక్కులు అందజేస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

## కార్యకర్తల కుటుంబాలకు అండగా బీఆర్ఎస్

- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట టౌన్, జూన్ 10 : పార్టీ కోసం కష్టపడి పని చేసే ప్రతి కార్యకర్తకు బీఆర్ఎస్ ఎప్పుడూ అండగా ఉంటుందని మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యుడు గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. ఇటీవల వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో మరణించిన బీఆర్ఎస్ కార్యకర్తలకు పార్టీ సభ్యత్వ ఇన్సూరెన్స్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గులాబీ జెండా గుండెకు హత్తుకొని నిత్యం ప్రజలతో మమేకమై వారి కష్ట సుఖాల్లో భాగస్వాములయ్యే కార్యకర్తలకు బీఆర్ఎస్ అండగా నిలుస్తుందన్నారు. బీఆర్ఎస్ సైనికులకు రక్షణ కవచంలా బీమా ఉపయోగపడుతుందని తెలిపారు. నిత్యం ప్రజల్లో ఉంటూ పార్టీ కోసం, ప్రజల కోస పని చేసే కార్యకర్తలకు ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే ఆ కుటుంబం రోడ్డున పడకుండా కేసీఆర్ రూ.2లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించారని చెప్పారు. గతంలో కొన్ని పార్టీలు తమ కార్యకర్తలకు బీమా కల్పించినా, ఇంత క్రమశిక్షణతో కొనసాగిస్తున్న పార్టీ మాత్రం బీఆర్ఎస్ అని తెలిపారు. తమకు బీమా పరిహారం అందించిన బీఆర్ఎస్ పార్టీకి, అందేలా కృషి చేసిన మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కేంద్రంలోని 43వ వార్డుకు చెందిన కాసాని జానమ్మ, కాసాని చంద్రయ్య, పెన్‌పహాడ్ మండలం ధర్మాపురం గ్రామానికి చెందిన మొండికత్తి భాగ్యమ్మ కుటుంబాలు ఇన్సూరెన్స్ చెక్కులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, వైస్ చైర్మన్ పుట్ట కిశోర్, కౌన్సిలర్ తాహేర్‌పాషా, ఆకుల లవకుశ, మాజీ సర్పంచ్ నెమ్మాది నగేశ్, రఫీ, కరుణ, మహేశ్వరి పాల్గొన్నారు.




సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం నల్లగొండ డీఈఓ కార్యాలయం ఎదుట బారులు దీరిన ఉపాధ్యాయులు

## పండిట్, పీఈటీల సర్టిఫికెట్ల పరిశీలన

- డీఈఓ కార్యాలయంలో సజావుగా అప్‌గ్రెడేషన్ ప్రక్రియ



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న డీఈఓ భిక్షపతి, అధికారులు

రామగిరి, జూన్ 10 : ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం పండిట్, పీఈటీలను అప్‌గ్రెడేషన్ చేస్తామని చెప్పింది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఆదివారంతో ముగియడంతో జిల్లా వ్యాప్తంగా ఆయా కేటగిరీలో పని చేస్తున్న ఉపాధ్యాయులు సోమవారం నల్లగొండ డీఈఓ కార్యాలయానికి చేరుకున్నారు. పండిట్స్, పీఈటీలు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, సర్వీసు పుస్తకంతో వచ్చారు. నల్లగొండ జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలల్లో భాషా పండిట్‌లు, పీఈటీలు 728 మంది పనిచేస్తున్నారు. వీరిలో లాంగ్వేజ్ పండిట్.. తెలుగు –204, హిందీ –153, ఉర్దూ –7, పీఈటీ –124 మంది ఉన్నారు. కేటగిరీల వారీగా పుట్టిన తేదీ, విద్యార్హతలు, ఉద్యోగంలో చేరిన తేదీ, అదనపు విద్యార్హతల సర్టిఫికెట్లను అధికారులు పరిశీలించి ఉపాధ్యాయుల సంతకాలు తీసుకున్నారు. అప్‌గ్రెడేషన్‌కు ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో రావడంతో డీఈఓ కార్యాలయ ఆవరణ కిక్కిరిసిపోయింది. తొలుత రెండు కౌంటర్స్ మాత్రమే ఏర్పాటు చేసి సర్టిఫికెట్స్ పరిశీలన చేయగా తోపులాట జరుగడంతో డీఈఓ భిక్షపతి మరో మూడు కౌంటర్స్ ఏర్పాటు చేయించారు. డీఈఓతోపాటు నల్లగొండ ఆర్డీఓ రవి పరిశీలన కౌంటర్స్ వద్ద ఉండి వెరిఫికేషన్ సజావుగా జరిగేలా చర్యలు తీసుకున్నారు.

### ఉమ్మడి జిల్లాలో 735 మంది పండిట్లు, 259 పీఈటీలకు అవకాశం

ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా పండిట్‌లకు సంబంధించి 848 సాంక్షన్ పోస్టులుండగా 735 పోస్టులను, 309 సాంక్షన్ పీఈటీ పోస్టులు ఉండగా 259 పోస్టులను అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు రాష్ట్ర విద్యాశాఖ వెల్లడించింది.

**పండిట్ అప్‌గ్రెడేషన్ ఇలా..**

| జిల్లా | తెలుగు | హిందీ | ఉర్దూ | మొత్తం |
|---|---|---|---|---|
| | శాంక్షన్ –అప్‌గ్రేడ్ | శాంక్షన్ –అప్‌గ్రేడ్ | శాంక్షన్ –అప్‌గ్రేడ్ | శాంక్షన్–అప్‌గ్రేడ్ |
| నల్లగొండ | 215 – 191 | 167–149 | 9–8 | 391–348 |
| సూర్యాపేట | 140 – 125 | 107– 95 | 0–0 | 247 – 199 |
| యాదాద్రి | 129–115 | 77 –69 | 4–4 | 210 – 188 |
| మొత్తం | 484– 431 | 351– 313 | 13–12 | 848–735 |

### పీఈటీల అప్‌గ్రెడేషన్ ఇలా..

నల్లగొండ జిల్లాలో 126 సాంక్షన్ పోస్టులు ఉండగా 104 అప్‌గ్రేడ్ చేశారు. సూర్యాపేట జిల్లాలో 99 సాంక్షన్ పోస్టులకు గానూ 83, యాదాద్రి భువనగిరి జిల్లాలో 84 సాంక్షన్ పోస్టులకుగానూ 70 పోస్టులను అప్‌గ్రేడ్ చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 309 శాంక్షన్ పోస్టులు ఉండగా 259 పోస్టులు అప్‌గ్రేడ్ అయినట్లు అధికారులు తెలిపారు.



డీసీఓకు అవిశ్వాసం నోటీసు అందిస్తున్న డీసీసీబీ డైరెక్టర్లు

## డీసీసీబీ చైర్మన్‌పై అవిశ్వాసం

- డీసీఓకు నోటీసు అందజేసిన 14 మంది డైరెక్టర్లు
- ఈ నెల 20న అవిశ్వాసానికి ఓకే

నల్లగొండ ప్రతినిధి, జూన్10(నమస్తే తెలంగాణ) : నల్లగొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డిపై అవిశ్వాసానికి కాంగ్రెస్ పార్టీ తెరలేపింది. ఎన్నికలకు మరో ఏడు నెలలే గడువున్నా చైర్మన్ కుర్చీని తమ ఆధీనంలోకి తెచ్చుకోవాలని కొన్ని రోజులు ఆ పార్టీ పెద్దలు పావులు కదుపుతున్నారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డితోపాటు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఇందులో కీలక వ్యవహరిస్తున్నట్లు సమాచారం. మునుగోడు పీఏసీఎస్ చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాసరెడ్డిని చైర్మన్ స్థానంలో కూర్చోబెట్టాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలిసింది. అందులో భాగంగా సోమవారం డీసీసీబీకి చెందిన 14 మంది డైరెక్టర్లు అవిశ్వాస తీర్మాన ప్రతిపై సంతకం చేసి జిల్లా సహకార అధికారి కిరణ్‌కుమార్‌కు లేఖ అందజేశారు. వారంతా ఆదివారం రాత్రే కలుసుకుని నేరుగా నల్లగొండకు బస్సులో చేరుకున్నారు. కలెక్టరేట్ ఆవరణలో ఉండే జిల్లా సహకార అధికారికి కార్యాలయానికి వెళ్లి అవిశ్వాస తీర్మానానికి సంబంధించిన లేఖను అందజేశారు. ఈ విషయంలో అధికారులు కూడా వెంటనే స్పందించడం గమనార్హం. సోమవారం సాయంత్రమే అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడానికి ఈ నెల 20న గడువుగా ప్రకటించడం విశేషం. అవిశ్వాస తీర్మానం వెనుక మంత్రుల ఒత్తిడి ఉండడంతో వెంటనే తేదీ నిర్ణయించారన్న చర్చ సాగుతున్నది. వాస్తవంగా 2020 ఫిబ్రవరిలో సహకార ఎన్నికలు జరిగాయి. ఇందులో బీఆర్ఎస్‌కు చెందని వారే 90 శాతానికిపైగా చైర్మన్లుగా ఎన్నికయ్యారు. అందులో నుంచి మొత్తం 19 మంది డీసీసీబీ డైరెక్టర్లకుగానూ 18 మంది బీఆర్ఎస్ వాళ్లే ఎన్నికయ్యారు. మునుగోడు పీఏసీఎస్ చైర్మన్ కుంభం శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ పార్టీ నుంచి ఏకైక డైరెక్టర్‌గా ఉన్నారు. తదనంతర పరిణామాలు, అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో ఎక్కువ ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీ గెలుచుకోవడం వంటి వాటితో బీఆర్ఎస్‌కు చెందిన డీసీసీబీ డైరెక్టర్లలో కొందరు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

ఇదే అదునుగా డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డిని సైతం కాంగ్రెస్ పార్టీలో చేరాలంటూ కాంగ్రెస్ కీలక నేతలు ఒత్తిడి చేశారు. చైర్మన్ పదవి పోయినా పర్వాలేదు కానీ కాంగ్రెస్‌లో చేరేది లేదని మహేందర్‌రెడ్డి కాంగ్రెస్ పెద్దలకు కరాఖండిగా తేల్చిచెప్పారు. మొదట్లో కాంగ్రెస్ పార్టీలోనే తాను పని చేసినా 23 ఏండ్లుగా బీఆర్ఎస్‌తో వీడదీయలేని బంధం ఏర్పడిందని, పార్టీ అధినేత కేసీఆర్ తమను కుటుంబసభ్యులుగా భావిస్తారని, తమకు అత్యున్నత పదవులు కట్టబెట్టి ఆశీర్వదించారని మహేందర్‌రెడ్డి స్పష్టం చేస్తున్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో తన చైర్మన్ పదవిని కాపాడుకోవడం కోసం పార్టీకి ద్రోహం చేయలేనని కాంగ్రెస్ పెద్దలకే స్పష్టం చేసినట్లు తెలిసింది.

దాంతో కాంగ్రెస్ ముఖ్యులు మహేందర్‌రెడ్డిపై కక్షగట్టి, డీసీసీబీ చైర్మన్ పదవి నుంచి దింపాలని అవిశ్వాసాన్ని తెరపైకి తెచ్చినట్లు తెలిసింది. కొద్దిరోజులుగా మిగతా డైరెక్టర్లను ప్రలోభపెడుతూ అవిశ్వాసానికి మద్దతు కూడగట్టారు. మొత్తం 19 మంది డైరెక్టర్లలో 14 మంది మద్దతుతో సోమవారం అవిశ్వాస తీర్మానానికి అనుమతించాలంటూ డీసీఓకు లేఖ అందజేశారు. దాంతో ఈ నెల 20న అవిశ్వాస తీర్మానానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీనికి సంబంధించి చైర్మన్‌తో పాటు డైరెక్టర్లు అందరికీ లేఖలు పంపించనున్నారు. ఇక మరోవైపు అవిశ్వాస తీర్మానానికి లేఖను అందజేసిన డైరెక్టర్లు అంతా కుంభం శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో క్యాంప్‌నకు తరలినట్లు తెలిసింది. కర్నాటకకు వెళ్లి అక్కడి నుంచి పర్యాటక ప్రాంతాల్లో క్యాంప్ కొనసాగించనున్నట్లు సమాచారం.

## బెస్ట్ అవైలబుల్ స్కీమ్ లక్కీడ్రా వేదిక మార్పు

సూర్యాపేట, జూన్ 10 : ఈ విద్యా సంవత్సరంలో బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీంలో భాగంగా మంగళవారం లక్కీ డ్రా తీయనున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కె.లత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అయితే.. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ముందుగా ప్రకటించిన కలెక్టరేట్ కార్యాలయానికి కాకుండా జమ్మిగడ్డలోని సూర్యాపేట ఫంక్షన్ హాల్‌కు ఉదయం 11 గంటలకు హాజరు కావాలని సూచించారు. జిల్లా అధికారుల సమక్షంలో లక్కీ డ్రా తీయనున్నట్లు తెలిపారు.



కోదాడలో నీటి పారుదల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యే పద్మావతి, కలెక్టర్ వెంకట్రావ్

## లిఫ్ట్‌ల నిర్వహణలో రైతులపై భారం తగ్గిస్తాం

- జూలై ఒకటి నాటికి ఎత్తిపోతల పథకాలన్నీ వినియోగంలోకి తేవాలి
- భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

కోదాడ, జూన్ 10 : సాగర్ ఎడమ కాల్వపై ఉన్న ఎత్తిపోతల పథకాలను సామర్థ్యంతో పని చేయించడమే తన లక్ష్యమని భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కోదాడ పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం సాగర్ లిఫ్ట్ ఇరిగేషన్ పనితీరుపై కలెక్టర్, ఇరిగేషన్ అధికారులతో కలిసి రైతుల సమక్షంలో ఏర్పాటు చేసిన విస్తృత స్థాయి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎత్తిపోతల పథకాల నిర్వహణలో రైతులపై భారం తగ్గించేందుకు లిఫ్ట్‌లపై సాంకేతిక సిబ్బంది ఎలక్ట్రీషియన్ ఆపరేటర్, వాచ్‌మెన్, పిట్టర్ పోస్టులను ఔట్ సోర్సింగ్ పద్ధతిలో నియమిస్తామని తెలిపారు. జూలై ఒకటో తేదీ నాటికి లిఫ్ట్‌లన్నీ పూర్తిస్థాయిలో పనిచేయాలని సూచించారు. సాగర్ ఎడమ కాల్వపై హుజూర్‌నగర్ నియోజకవర్గంలో 19 లిఫ్ట్‌లు ఉన్నాయని, అవి ఎలా పనిచేస్తున్నాయో అధికారులు చెప్పాలన్నారు. అలాగే మూసీ, పాలేరు వాగులపై ఉన్న లిఫ్ట్, ఇరిగేషన్ల పనితీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొత్త లిఫట ఇరిగేషన్లకు నీటి వనరులను బట్టి రైతులు సహకరిస్తే తప్పకుండా ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. చెరువులు ఆక్రమిస్తున్నట్లు వార్తలు అందుతున్నాయని, ఎవరైనా చెరువులు ఆక్రమిస్తే కేసులు నమోదు చేయాలని కలెక్టర్‌ను మంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే పద్మావతి, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వర్‌రావు, హుజూర్‌నగర్ ఎస్ఐ నర్సింహారావు, ఈఈలు సత్యనారాయణ, శ్రీనివాస్‌రావు, ఆర్డీఓలు, మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులన్నింటినీ పూర్తి చేయాలి

- కలెక్టర్ దాసరి హరిచందన



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన

నీలగిరి. జూన్ 10 : అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులన్నింటినీ వెంటనే పూర్తిచేయాలని కలెక్టర్ దాసరి హరిచందన ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. తన చాంబర్‌లో సోమవారం ఆమె అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు, విద్యార్థులకు దుస్తుల పంపిణీపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 12న పాఠశాలలు పునః ప్రారంభమవుతున్న దృష్ట్యా అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీరు, టాయిలెట్లు, ఎలక్ట్రికల్ వంటి మరమ్మతు పనులను పూర్తి చేయాలని తెలిపారు. విద్యార్థులకు యూనిఫామ్ పంపిణీకి చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి. పూర్ణచంద్ర, మిషన్ భగీరథ ఎస్ఈ డి. వెంకటేశ్వర్లు, వివిధ శాఖల ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## మూసీకి 534 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

- 636.70 అడుగులకు పెరిగిన నీటిమట్టం

కేతేపల్లి, జూన్ 10 : మూసీ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి సోమవారం 534.48 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 645 అడుగులు(4.46 టీఎంసీలు)కాగా, ప్రస్తుతం 636.70 అడుగులు(2.51 టీఎంసీలు) ఏఈ డి.ఉదయ్‌కుమార్ తెలిపారు. గత వారం రోజులుగా ఇన్‌ఫ్లో నిలకడగా 500 క్యూసెక్కులకు పైగా వస్తున్నది. ఎగువ ప్రాంతాల్లో గత నెల, ఈ నెలలో కురిసిన వర్షాల వల్ల ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో కొనసాగుతూ వస్తున్నది. ఏప్రిల్‌లో ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు నీటి విడుదల నిలిపి వేసిన సమయం నుంచి ఇప్పటి వరకు సుమారు17 అడుగుల మేర ప్రాజెక్టు నీటిమట్టం పెరిగింది. ఇన్‌ఫ్లో ఇదే స్థాయిలో కొనసాగితే ఈ నెల చివరి వరకు నీటిమట్టం 640 అడుగులకు పెరిగే అవకాశం ఉంది. ప్రాజెక్టులో నీటి మట్టం పెరుగుతుండటం, వానకాలం సీజన్ ప్రారంభం కావడంతో అధికారులు కాల్వలకు నీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.




